# నేరమేమిటి ?

సుధ ఎం.బి.ఏ.లో చేరగానే ఇంట్లో తల్లీ తండ్రి ముందు ప్రకటించింది -

"నాన్నా! అమ్మా! నాకు కాలేజీకి వెళ్ళడానికి స్కూటరు కొనిపెట్టాలి" అని.

"ఆడపిల్లకు స్కూటరేమిటే!" అని ఆశ్చర్యపోయింది తల్లి.

"అవునమ్మా! కావలిస్తే ఆటోలో పో. డబ్బు ఖర్చయిన ఏం లేదు. కానీ" అని సందేహంగా ఆగాడు తండ్రి.

"నువ్వు యీ రష్‌లో స్కూటరు నడపడమంటె" - అని తల్లి కూడా సందేహం ప్రకటించింది.

"అమ్మా! ఆడాళ్ళు కార్లు నడపడం లేదా?" అని సుధ అంటుండగానే

"కార్లు వేరే స్కూటరంటె మగాళ్ళు నడిపేది అందులో యీ భయంకరమైన ట్రాఫిక్కులో నడపడమంటె?-" అంది తల్లి.

"అమ్మా! నువ్వు ఇంట్లో కూర్చుంటావ్. బయట ఏంజరుగుతుందో తెలియదు నీకు. ఎంతోమంది ఆడపిల్లలు ఇప్పుడు లూనాలు స్కూటర్లు నడుపుతున్నారు తెలుసా!" అంది సుధ.

"నాన్నా! నువ్వేం మాట్లాడ్డంలేదు! నాకు స్కూటరు కావాలి!" అంది మంకుపట్టుతో. కాస్సేపు ఎవరూ మాట్లాడలేదు. చివరకు సుధ తండ్రి -

"సరేనమ్మా! కొని పెడ్తాను" అన్నాడు.

"నాన్నా! థాంక్యూ!" అని ఎగిరి గంతేసింది సుధ. తండ్రి బుగ్గ మీద ముద్దు పెట్టింది.

"ఏమోనబ్బ! ఆ స్కూటరుతో ఏం కష్టాలొస్తాయో!" అంది భయంగా తల్లి. సుధ తల్లి భయానికి నవ్వుకుంది.

సుధ బీ.కామ్ తర్వాత ఎం.బి.ఏ.లో చేరింది. ఎంట్రన్స్ పరీక్షలో యాభైలోపల ర్యాంకు వచ్చింది. దాంతో ఆమెకు యూనివర్సిటీ కాలేజీలోనే సీటు దొరికింది. అక్కడ సీటు దొరకడం విద్యార్థులు అదృష్టంగానే భావిస్తారు. సుధకు అంత మంచి ర్యాంకు రావడంతో ఆమె బీ.కామ్ చదివిన కాలేజీవాళ్ళు గర్వంగా భావించి పత్రికలో ఫోటోతో సహా వార్త వేసారు.

యూనివర్సిటీ కాలేజీలో సీటు దొరికినందుకు సుధకు చాలా ఆనందంగా వున్నా ఆ కాలేజీ సిటీకి దూరంగా వుంది. రావడం పోవడం సమస్యే! బస్సులో పోతే చాలా సమయమే పడ్తుంది'' ఇక చదివేది ఎప్పుడు!'' అనుకుంది సుధ.

''స్కూటరుంటే లైబ్రరీ పోవడం రావడం కూడా సులభమౌతుంది. మెయిన్ లైబ్రరీ కాలేజీకి దూరంగా వుంది. రెఫరెన్సు వర్కు బాగా జరుగాలంటే బండి వుండవల్సిందే'' అనుకొని సుధ తలిదండ్రులను స్కూటరు కొనిపెట్టమని అడిగింది.

దాంతో కొంత రాద్ధాంతం జరుగుతుందని సుధకు తెలుసు.

కానీ - అనుకున్నదానికన్నా సమస్య తొందరగానే తీరింది. నాన్న స్కూటరు కొని పెట్టాడు. సుధ ఒకటి రెండురోజుల్లోనే స్కూటరు నడపడం నేర్చుకుంది.

''తొందరగానే స్కూటరు నడపడం వచ్చేసిందే!'' ఆశ్చర్యపోయింది తల్లి.

''అమ్మా! ఏ బండి అయినా నడపడానికి ఆత్మవిశ్వాసం ముఖ్యం. అది వుంటె కాస్సే పట్లో నడపడం నేర్చుకోవచ్చును'' అంది సుధ.

''సుధా భద్రం తల్లీ. జాగర్తగా మెల్లగా నడుపు!'' అంది తల్లి.

సుధ స్కూటరును జాగర్తగా మెల్లగానే నడిపేది. ఆమె మెల్లగా వెళ్తున్నా ఒకసారి బర్రుమంటూ చప్పుడు చేస్తూ స్కూటరును వేగంగా తెచ్చి ఆమె పక్కనే మెల్లగా నడుపుతూ

''ఏయ్! మాతో రేసు కొస్తావా?'' అరిచాడు స్కూటరు నడుపుతున్నతను.

సుధ పక్కకు ముఖం తిప్పి చూస్తే స్కూటరు మీద ముగ్గురు కనిపించారు. పళ్ళన్నీ ఇకిలించి నవ్వి చేతులూపుతూ వేగంగా ముందుకు వెళ్ళిపోయారు.

స్కూటరు సైలన్సరు తీసేసారేమో స్కూటరు తెగ చప్పుడు చేస్తూ పోయింది.

సుధ స్కూటరు మీద పోతుంటె చాలాసార్లు -

''ఏయ్!'' అని కెవ్వున కేకవేస్తూ మగాళ్ళు స్కూటరు మీద దూసుకొని వెళ్లడం ఆమెకు అలవాటే అయింది. కార్ల వాళ్ళూ అంతే. ఆ కేకలకు ఆమె చలించకుండా నిబ్బరంగా వుండడం నేర్చుకుంది.

''ఒక ఆడపిల్ల స్కూటరు తోలుతూ పోతుంటె వాళ్ళకేమనిపిస్తుందో తెలియదు!'' అనుకుంది సుధ.

ఇక ఆమె స్కూటరువైపు ఆమెవైపు మెడతిప్పి చూడనివాళ్ళు రోజూ రోడ్డు మీద

అరుదుగానే కన్పిస్తారు సుధకు. వాళ్ళట్లా చూడడం సుధకు అలవాటయిపోయింది. వాళ్ళ చూపులను లెక్క చేయకపోవడం నేర్చుకుంది.

కాలేజీ ఆవరణలో సుధ తన స్కూటరును పార్కు చేయడానికి ఓ జాగా చూసుకుంది. కాని ఆమె పార్కు చేసినచోట రోజు ఎవరో తనకన్నా ముందే వచ్చి స్కూటరో మోటరుసైకిలో తెచ్చి పార్కు చేసేవారు. దాంతో సుధ విసిగిపోయి ఎక్కడ చోటు దొరికితే అక్కడే పార్కు చేసేది.

ఒకరోజు సుధ స్కూటరు చక్రంలోని గాలి తీసేసారెవరో.

"ఏమో! పంక్చరయి గాలి పోయిందేమో!" అనుకొని సుధ టయర్ మార్చుకుంది. అట్లా ఎన్నోసార్లు గాలి పోవడంతో ఆమె అది పంక్చరువల్ల కాదని తెలుసుకుంది. అట్లా ఎన్ని కష్టాలొచ్చినా సుధ స్కూటరు నడపడం మాత్రం మానలేదు.

ఒకరోజు చూస్తే స్టెప్నీ లేదు. "ఎవరో ఎత్తుకపోయారు" అనుకుంది సుధ. పోయి ప్రిన్సిపాల్‌కు యీ విషయం చెప్పింది. ఆయనేమో "టీచింగు స్టాఫు పార్కింగు చేసే చోట స్కూటరు పార్కు చేసుకోమ్మా" అని సలహా ఇచ్చాడు. సుధ రోడ్డు మీద స్కూటరు నడుపు తున్నపుడు స్కూటరువాళ్ళు మోటారు సైకిల్ వాళ్ళు దగ్గరగా వచ్చి డ్యాష్ ఇచ్చినంత పనిచేసి దూసుకపోవడం ఎన్నోసార్లు జరిగింది. అయినా సుధ ధైర్యం విడిచిపెట్టలేదు. తల్లికీ విషయం చెప్తే తల్లి స్కూటరు నడపవద్దని అంటుందని సుధ తల్లిక్కూడా చెప్పలేదు.

సుధ ఎం.బి.ఏ. పూర్తి చేయగానే ప్రసిద్ధమైన కంపెనీలో అడ్వటయిజ్‌మెంటు విభాగంలో మంచి ఉద్యోగం వచ్చింది. ఆ కంపెనీలోనే పనిచేసే ప్రదీప్‌తో సుధకు పరిచయ మైంది. పరిచయం స్నేహంగా మారి పెళ్ళి వరకు వచ్చింది. ఇద్దరి తలిదండ్రులు ఒప్పుకున్నారీ పెళ్ళికి. ముహూర్తం కూడా నిశ్చయమైంది. పెళ్ళయిం తర్వాత హనిమూన్ సమయంలోనే సెలవు పెడ్దామనుకున్నారు వాళ్ళిద్దరు. అందుకే పెళ్ళివరకూ ఇద్దరూ పని చేస్తున్నారు.

సుధ ప్రదీప్‌లు ఓరోజు ఆఫీసు నుంచే బజారుకు పోయి పెళ్ళిబట్టలు కొనుక్కోవాలని అనుకున్నారు. ప్రదీప్‌కు అనుకోకుండా ఆరోజు వేరే వాళ్ళ బ్రాంచీలోనే పనిపడ్తే అక్కడికి వెళ్ళిపోయాడు. పోతూ -

"నేను నేరుగా షాపుకే వస్తాను. నువ్వు ఆఫీసు నుంచి షాపుకు వచ్చేయి" అని సుధకు చెప్పాడు. సుధ రోజుకన్నా ముందే ఆఫీసు నుంచి బయటికి వచ్చి షాపుకు బయలుదేరింది.

ఇంకా ఆఫీసులు విడిచిపెట్టే వేళ కాలేదు. స్కూళ్ళు ఎప్పుడో వదిలిపెట్టేసారు. "అయినా రోడ్ల మీద రష్‌కేమి తక్కువలేదు" అనుకుంది సుధ నిండుగా వున్న రోడ్లను చూసి.

సుధ అలవాటు చొప్పున ఓ పక్కగా మెల్లగానే స్కూటరును నడుపుతున్నది. ఇంతలో ఎవరో "హే!" అని కేకవేస్తూ పక్క నుంచి స్కూటరు మీద దూసుకొని వెళ్ళిపోయారు. ఇద్దరూ

ఒక్కసారే అరిచేసరికి సుధ మెడ తిప్పి పక్కకు చూసింది. దూసుక వెళ్ళిపోయిన స్కూటరు వెనుక డబల్‌డెకర్ బస్సు వస్తున్నది. ఆ బస్సుడ్రైవరు సుధవైపు చూస్తూ వెకిలిగా నవ్వుతూ కనిపించాడు.

సుధకదంతా అలవాటే - ఆమె చూపులు రోడ్డు మీదికి తిప్పింది. మెల్లగా స్కూటరు డ్రైవ్ చేసుకుంటూ, ముందుకు వెళ్ళిపోయింది. డబల్‌డెకర్ బస్సు బస్టాపులో ఆగింది. మళ్ళా స్టార్టు అయిన డబల్‌డెకర్ బస్సు సుధను దాటి ముందుకు పోయింది.

"రేస్ చేయి!" అన్నట్లుగా సుధవైపు చూసి తలూపాడు బస్సు డ్రైవరు మళ్ళీ వెకిలిగా నవ్వుతూ. సుధ ఏం చూడనట్లుగా మెల్లగా స్టడీగా ముందుకెళ్ళిపోయింది.

డబల్‌డెకర్ బస్సు బస్టాపులో ఆగి మళ్ళా కదిలింది. ఈసారి డబల్ డెకర్ బస్సు రోడ్డు మధ్యలో ముందుకెళ్ళిపోకుండా సుధ స్కూటరు పక్కగా వచ్చింది. డ్రైవరు కొద్దిగా జర్కు ఇచ్చి బస్సును సుధ స్కూటరుకు తగిలించి ముందుకు వేగంగా దూసుకపోయాడు.

డబల్ డెకర్ బస్సు కాస్త తగిలింది. అంతే - సుధ స్కూటరు పక్కకు పడిపోయింది. సుధ కిందపడింది. పడడమే ఆమె తల అక్కడే వున్న పేవ్‌మెంటు రాయికి గుద్దుకుంది. తలకు గాయమైంది. రక్తం ధారగా బయటికి వచ్చి నేలమీద గడ్డ కట్టుకపోయింది. సుధ ప్రాణాలు వెంటనే గాలిలో కలిసిపోయాయి. ఆమె కళ్ళు తెరుచుకొనే వున్నాయి.

ఆ కళ్ళు "నేనేం నేరం చేసాను!" అని ప్రశ్నిస్తున్నట్లుగా అనిపించాయి చుట్టూ గుమిగూడిన జనాన్ని తోసుకొని ముందుకు వచ్చిన ప్రదీప్‌కు.

* * *